# జిమ్‌లలో రక్తపోటు పెంచే ఔషధాలు

**అనుమతి లేకుండా మెఫటర్మైన్ సల్ఫేట్ ఇంజక్షన్‌లు**

**ఇద్దరు అరెస్ట్.. రూ.4.32లక్షల విలువైన 288 ఇంజక్షన్ వైల్స్ స్వాధీనం**

సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ)/బండ్లగూడ: జిమ్‌లో అలసిపోకుండా అధిక వర్కౌట్లు చేసేందుకు రక్తపోటును పెంచే 'మెఫటర్మైన్ సల్ఫేట్' ఇంజక్షన్లను వినియోగిస్తున్న విషయం బయటపడింది. ఎలాంటి అనుమతి లేకుండా 'మెఫటర్మైన్ సల్ఫేట్' ఇంజక్షన్లను విక్రయిస్తున్న రెండు వేర్వేరు ముఠాలకు చెందిన ఇద్దరిని రాజేంద్రనగర్ డివిజన్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శైలజా రాణి ఫిర్యాదు మేరకు మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్ జోన్ ఎస్‌ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి 288 'మెఫటర్మైన్ సల్ఫేట్' ఇంజక్షన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రాజేంద్రనగర్ జోన్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శైలజారాణితో కలిసి డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి కేసు పూర్వాపరాలను వెల్లడించారు. ధూల్‌పేట ప్రాంతానికి చెందిన నితీష్(32) జిమ్ ట్రైనర్. అదే ప్రాంతానికి చెందిన రాహుల్‌తో కలిసి నితీష్ ఎలాంటి అనుమతి లేకుండా 'మెఫటర్మైన్ సల్ఫేట్' ఇంజక్షన్లను విక్రయిస్తున్నాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ డివిజన్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శైలజారాణి.. మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ పోలీసులతో కలిసి ఆదివారం సాయంత్రం దుర్గానగర్ చౌరస్తాలో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న నితీష్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. ధూల్‌పేటకు చెందిన రాహుల్‌తో కలిసి మెఫటర్మైన్ సల్ఫేట్ ఇంజక్షన్లను విక్రయిస్తున్నట్లు వెల్లడించాడు. ఈ మేరకు పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. అతడి వద్ద నుంచి రూ.లక్షా 89వేల విలువజేసే 126 మెఫటర్మైన్ సల్ఫేట్ ఇంజక్షన్ వైల్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై నారాయణగూడ పీఎస్‌లో ఆయుధాల చట్టం కింద ఒక కేసు, ఆసిఫ్‌నగర్ పీఎస్‌లో మెఫటర్‌మైన్ ఇంజక్షన్ కేసు నమోదై ఉన్నట్లు డీసీపీ తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఔషధాలు

### మరో కేసులో..

విశ్వసనీయ సమాచారం మేరకు వట్టేపల్లి రైల్వే గేటు వద్ద ఒక సంచితో తచ్చాడుతున్న వ్యక్తిని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదు మేరకు మైలార్‌దేవ్‌పల్లి, ఎస్‌ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. పాతబస్తీ బార్కాస్‌కు చెందిన షోహెల్ నహేది (30)గా తేలింది. అతడి వద్దనున్న సంచిని పరిశీలించగా.. మెఫటర్మైన్ సల్ఫేట్ (పింక్) 61వైల్స్, గ్రీన్ 101వైల్స్, 7 ఇంజక్షన్స్ లభించాయి. వీటి విలువ రూ.2లక్షల 43వేల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు షోహెల్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

### రక్తపోటును పెంచేందుకు..

మెఫటర్మైన్ సల్ఫేట్ ఇంజక్షన్లు సాధారణంగా లోబీపీ ఉన్నవారిలో రక్తపోటును పెంచి.. నియంత్రించేందుకు వాడతారని అధికారులు తెలిపారు. జిమ్ సెంటర్లలో కొంత మంది ట్రైనర్లు అధిక వర్కౌట్లు చేసేందుకు అక్రమంగా మెఫటర్మైన్ సల్ఫేట్ ఇంజక్షన్లను అక్కడకు వచ్చే యువతకు అక్రమ మార్గంలో విక్రయిస్తున్నట్లు తెలిపారు. అయితే, పట్టుబడిన నిందితులు మెఫటర్మైన్ ఇంజక్షన్లను ఎవరికి విక్రయించేందుకు వచ్చారో.. ఎంత కాలంగా ఈ వ్యాపారం చేస్తున్నారో.. అన్న వివరాలు విచారణలో తేలాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కేసును ఛేదించిన మైలార్‌దేవ్‌పల్లి, ఎస్‌ఓటీ పోలీసులను డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి అభినందించారు.

## స్టెరాయిడ్ ఇంజక్షన్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాలానగర్ జోన్ డీసీపీ టి.శ్రీనివాస్ రావు

జీడిమెట్ల, జూన్ 19 : ఎలాంటి లైసెన్స్ , డాక్టర్ చీటీ లేకుండా ఇంజక్షన్లు, స్టెరాయిడ్ టాబ్లెట్లను విక్రయిస్తున్న ఓ వ్యక్తిని సనత్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. బాలానగర్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ టి.శ్రీనివాస్ రావు సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన హరీష్ సేనాపతి (28) ఫతేనగర్ రామాలయం వీధిలో ఉంటున్నాడు. 2009లో నగరానికి వలస వచ్చిన అతడు ఉపాధి నిమిత్తం ఎలక్ట్రానిక్ షాపులో ఉద్యోగంలో చేరాడు. జీతం డబ్బులు సరిపోకపోవడంతో హెల్త్ వెల్‌నెస్ పేరుతో ప్రొటీన్ సప్లిమెంట్ స్టోర్‌ను ఏర్పాటు చేశాడు. కొంత కాలం తరువాత అతడికి చెన్నైకి చెందిన శ్రీనివాస్ ఫేస్ బుక్ ద్వారా పరిచయమయ్యాడు. స్టెరాయిడ్ ఇంజక్షన్లు, మందులు విక్రయిస్తే తక్కువ సమయంలో పెద్ద మొత్తంలో డబ్బులు సంపాదించవచ్చని సూచించాడు. హరీష్ సేనా పతి అంగీకరించాడు. ఈ మందులను వైద్యుల సూచన, ప్రిస్క్రిప్షన్ మేరకే విక్రయించాల్సి ఉంటుంది. అయితే, నిబంధనలకు విరుద్ధంగా రూ.600 ఉన్న వాటిని రూ.1000కు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. కొన్ని నెలలుగా సనత్‌నగర్ పరిసర ప్రాంతాల్లో యువతను మోసం చేస్తూ విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఫతేనగర్‌లో సనత్‌నగర్ పోలీసులు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సహాయంతో హరీష్ సేనాపతిని పట్టుకున్నారు. చైన్నైకి చెందిన శ్రీనివాస్ పరారీలో ఉన్నాడు. అతడి వద్ద నుంచి ప్రమాదకరమైన 33 రకాల ఇంజక్షన్లను, ట్యాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ సుమారు రూ. 3 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో బాలానగర్ ఏసీపీ గంగారం, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శివతేజ, సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ ముత్తు యాదవ్, ఎస్‌ఐ మురళీగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో.. 150కిలోల గంజాయి పట్టివేత

**ట్రాఫిక్ పోలీసులను అభినందించిన సీపీ స్టీఫెన్ రవీంద్ర**


మేడ్చల్ ట్రాఫిక్ సిబ్బందిని అభినందిస్తున్న సీపీ స్టీఫెన్ రవీంద్ర

సిటీబ్యూరో/మేడ్చల్ , జూన్ 19 (నమస్తే తెలంగాణ): ట్రాఫిక్ నిర్వహణ, వాహనాల తనిఖీలు, జరిమానాలు విధించడం.. తదితర వాటికే ఇంతకాలం పరిమితమైన ట్రాఫిక్ పోలీసులు తాజాగా.. సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు సైతం అడ్డుకట్ట వేసే దిశగా సేవలందిస్తున్నారు. ఈ క్రమంలోనే మేడ్చల్ ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో భాగంగా గంజాయి తరలిస్తున్న వాహనాన్ని గుర్తించి సీజ్ చేశారు. ఈనెల 17వ తేదీ రాత్రి మేడ్చల్ చెక్‌పోస్ట్ ప్రాంతంలో మేడ్చల్ ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో అటుగా వస్తున్న స్కార్పియో వాహనాన్ని ఆపేందుకు యత్నించగా.. వాహనంలోని వ్యక్తులు పోలీసులను చూసి స్కార్పియో వాహనాన్ని అక్కడే వదిలేసి పారిపోయారు. దీంతో అనుమానం వచ్చి స్కార్పియో వాహనాన్ని తనిఖీ చేయగా.. అందులో 150కిలోల గంజాయి బయటపడింది. వాహనంతోపాటు 150 కిలోల గంజాయి, నిందితులకు సంబంధించిన ఒక సెల్‌ఫోన్‌ను ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేశారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును మేడ్చల్ శాంతిభద్రతల పోలీసులకు అప్పగించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ పెద్ద మొత్తంలో గంజాయి రవాణాను అడ్డుకున్న మేడ్చల్ ట్రాఫిక్ పోలీసులను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ్ నాయక్‌తో కలిసి సీపీ స్టీఫెన్ రవీంద్ర అభినందించారు.

## సినీ దర్శకుడు కేపీ చౌదరి కస్టడీ తీర్పు వాయిదా

సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ): డ్రగ్స్ కేసులో నిందితుడైన సినీ నిర్మాత చౌదరి కస్టడీ తీర్పు మంగళవారానికి వాయిదాపడింది. రాజేంద్రనగర్, కిస్మత్‌పూర్‌లో ఇటీవల కొకైన్ విక్రయిస్తూ పోలీసులకు రెడ్‌హ్యాండెడ్‌గా అతడు పట్టుబడిన విషయం తెలిసిందే. అయితే, డ్రగ్స్ కేసులో సినీ పరిశ్రమలోని ఇంకా ఎవరికైనా లింకులు ఉన్నాయా.. ఎవరెవరికీ డ్రగ్స్ సరఫరా చేశాడు.. సెలబ్రిటీల్లో ఎవరెవరు మత్తు పదార్థాలు వినియోగిస్తారు.. వంటి తదితర వివరాలను సేకరించేందుకు రిమాండ్‌లో ఉన్న కేపీ చౌదరిని పోలీసు కస్టడీకి కోరుతూ రాజేంద్రనగర్ పోలీసులు కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఈ మేరకు విచారణ జరిపిన న్యాయస్థానం కస్టడీ తీర్పును మరోసారి మంగళవారానికి వాయిదా వేసింది.

**బినామీ పేర్లతో బ్యాంకు ఖాతాలు**

# రుణాలు పొంది ఎగనామం..

- ఐసీఐసీఐ బ్యాంకుకు రూ. 7.3 కోట్ల మోసం
- సీసీఎస్‌లో కేసు నమోదు

సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ): బినామీ ఉద్యోగుల పేరుతో క్రెడిట్ కార్డులు పొంది.. తమ సంస్థకు రూ. 7.31 కోట్లు మోసం చేశారంటూ ఐసీఐసీఐ బ్యాంక్ ప్రతినిధులు సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల కథనం ప్రకారం.. ఎస్‌ఆర్‌నగర్ బ్రాంచ్ ప్రీ అప్రూవ్డ్ లోన్స్, క్రెడిట్ కార్డులు ఇస్తుంది. ఈ క్రమంలో బర్నాల నాగరాజుకు చెందిన లీఫ్ టెక్నాలజీస్, తమ్మినేని ఉపేందర్ నాయుడుకు చెందిన యూసీ టెక్నాలజీస్ అండ్ సొల్యూషన్స్, జలాషాగారి చాంద్ భాషాకు చెందిన స్పేస్ ఇంటీరియర్, దిద్దుకూరి వెంకటరమణ చౌదరికి చెందిన డెకర్ ఇండియా సొల్యూషన్స్, మల్లికార్జున్‌రెడ్డి ప్రొపరేటర్‌గా ఉన్న ఎం.ఎస్. ఎంటర్‌ప్రైజెస్, పత్తిపాటి భరత్‌కుమార్ ప్రొపరేటర్‌గా ఉన్న ఏడీపీఎస్ సర్వీసెస్‌లకు చెందిన సంస్థలు తమ ఖాతాలు ఐసీఐసీఐ బ్యాంకులో నిర్వహిస్తూ.. ఉద్యోగుల జీతాలకు సంబంధించిన నెలవారీ జీతాలు అందులో జమ చేశారు. అయితే, బ్యాంకు అధికారులు ఈ ఖాతాలకు సంబంధించిన అంతర్గత తనిఖీలు నిర్వహించారు. ఆయా సంస్థలు జీతాల ఖాతాలను చూపించి.. కొందరు బ్యాంకుల నుంచి వివిధ రుణాలు తీసుకున్నట్లు వెల్లడైంది. కొంత కాలం తర్వాత ఆయా ఖాతాలలో జీతాలు కూడా డిపాజిట్ కాకపోవడం, తీసుకున్న రుణాలు కూడా తిరిగి చెల్లించకపోవడంతో ఆయా ఖాతాలు అనుమానాస్పదంగా ఉన్నట్లు బ్యాంకు అధికారులు గుర్తించి మరింత లోతుగా ఆరా తీశారు. బ్యాంకు ఖాతాలు తెరిచే సమయంలోనూ, బ్యాంకు నుంచి రుణాలు తీసుకున్న సమయంలోనూ ఇచ్చిన ఫోన్ నంబర్లు స్విచ్ఛాఫ్ ఉన్నాయి. డాక్యుమెంట్లలో పేర్కొన్న చిరునామాలో కూడా దాదాపు లేకపోవడం, చాలా వరకు కార్యాలయాలు కూడా మూసి ఉన్నాయి. అన్ని ఖాతాలకు సంబంధించిన లావాదేవీలను ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ ద్వారా ఒకే ఐపీ అడ్రస్‌తో నిర్వహించారు. కంపెనీ చిరునామా, ఉద్యోగుల చిరునామాలు కూడా ఒకటే ఉండటాన్ని బ్యాంక్ అధికారులు గుర్తించారు. పక్కా ప్లాన్‌తోనే బ్యాంకులో ఖాతాలు తెరిచి.. ఆ తర్వాత జీతాల ఖాతాల ద్వారా బ్యాంకుల నుంచి రుణాలు, క్రెడిట్ కార్డులు పొంది, తిరిగి బ్యాంకుకు చెల్లించకుండా రూ. 7.31 కోట్లు మోసం చేశారంటూ ఐసీఐసీఐ రీజినల్ హెడ్ అబ్దుల్ ఖుద్దూస్ సీసీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రూ. 15నే కదా.. అని ఊరుకోలేదు..

- కేసువేసి గెలిచిన వినియోగదారుడు

సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ): నిత్యం బిజీగా ఉండే నగర జీవనంలో సమయం లేదు మిత్రమా.. అనేవాళ్లే బోలెడు. పార్కింగ్‌లోనో, ఏవైనా వస్తువులు కొనుగోలు చేసినప్పుడు అదనపు చార్జీలు వసూలు చేస్తే.. పోనీలే ఇప్పుడు టైం లేదు అనుకుంటూ.. అడిగినంత ఇచ్చేసి వెళుతుంటారు. కానీ, ఓ వినియోగదారుడు అట్లా ఆలోచించలేదు. రూ.15నే కదా... పోతేపోని అని ఊరుకోలేదు. తనకు జరిగిన ఆర్థిక నష్టాన్ని, అదనపు చార్జీలను వసూలు చేసిన సంస్థపై వినియోగదారుల కమిషన్‌లో కేసు వేసి గెలిచాడు. వివరాలు ఇలా ఉన్నాయి. చార్మినార్ పరిధిలోని చెత్తబజార్‌కు చెందిన సలేశ్ బిన్ అలీ అహ్మది బంజారాహిల్స్ రోడ్డు నంబర్-3లోని బిర్యానీ వాలాలో 2021 మార్చి 2న ఒక ప్లేట్ మటన్ బిర్యానీకి రూ.380, కూల్‌డ్రింక్ రూ.45, ఒక వాటర్ బాటిల్ రూ.30లకు కొనుగోలు చేశారు. అయితే, హోటల్ నిర్వాహకులు కూల్‌డ్రింక్‌పై రూ.5, వాటర్ బాటిల్‌పై రూ.10 అదనంగా వసూలు చేశారు. దీంతో కొనుగోలుదారుడు అదనపు చార్జీ ఎందుకు వేస్తున్నారని ప్రశ్నించగా సమాధానం చెప్పకుండా దాటవేశారు. దీంతో కొనుగోలుదారుడు హైదరాబాద్ వినియోగదారుల కమిషన్-1లో కేసు వేశాడు. కేసును కమిషన్ అధ్యక్షురాలు బి.ఉమావెంకట సుబ్బలక్ష్మి, సభ్యులు సి.లక్ష్మీప్రసన్న, ఆర్.నారాయణరెడ్డిలతో కూడిన బెంచ్ విచారణ చేపట్టింది. అదనపు చార్జీలు వసూలు చేయడంతోపాటు సర్వీసు చేయడంలో కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. కాగా, సర్వీసులో ఎలాంటి లోపం లేదని, రుచికరమైన బిర్యానీని అందజేశామని హోటల్ నిర్వాహకులు తమ వాదనను వినిపించారు. అయితే, అదనంగా ఎందుకు వసూలు చేశారని ప్రశ్నించగా.. హోటల్ పక్షం నుంచి సమాధానం చెప్పలేకపోయారు. నిబంధనల ప్రకారం అదనపు చార్జీ వేసినందుకు 9 శాతం వడ్డీతో కలిపి రూ.15 రీఫండ్ చేయాలని, వినియోగదారుడిని ఇబ్బందులకు గురిచేసినందుకు రూ. వెయ్యి నష్టపరిహారంగా చెల్లించాలని కమిషన్ పేర్కొంది.

**కంపెనీకి జరిమానా..**

గోషామహల్‌కు చెందిన వెంకటేశ్వర చారి అనే వినియోగదారుడు శాంసంగ్ ఇండియా ఎలక్ట్రానిక్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి రూ.24.5 వేలు చెల్లించి వాషింగ్ మెషీన్ కొనుగోలు చేశారు. 3 నెలల అనంతరం మెషిన్ పనిచేయకుండా మొరాయించింది. దీంతో కొనుగోలుదారుడు సదరు కంపెనీకి ఫిర్యాదు చేయగా పలుమార్లు ఎగ్జిక్యూటివ్‌ను పంపి మరమ్మతు చేసినా పనిచేయకపోవడంతో తాను చెల్లించిన డబ్బు తిరిగి ఇవ్వాలని వినియోగదారుడు కోరాడు. యాజమాన్యం స్పందించకపోవడంతో వినియోగదారుల కమిషన్-1ను ఆశ్రయించారు. విచారణ జరిపిన బెంచ్ వినియోగదారుడికి రూ.20.5 వేలు తిరిగి చెల్లించాలని.. లేదా కొత్త మిషన్ అందజేయాలని ఆదేశించింది. లేనిపక్షంలో రూ.10 వేల నష్ట పరిహారం.. కోర్టు ఖర్చుల కింద మరో రూ.5 వేలు అందజేయాలని సూచించింది.